క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

సంబేపల్లె : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నేడు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ నాగశ్రీలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలస్థాయి అధికారులు వారి ప్రగతి నివేదికలతో సభకు రావాలన్నారు. ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరు కావాలని తెలియజేశారు.

పెంపుడు కుక్కలకు రేబీస్ టీకాలు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు రేబీస్ టీకాలు ఉచితంగా వేస్తున్నట్లు డాక్టర్ వేదవతి తెలిపారు. ఈ టీకాలను కాకర్ల వారిపల్లి పశువైద్యశాలలో వేస్తామని ఆమె చెప్పారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

పుల్లంపేట : కౌలు రైతులు కౌలు కార్డుల కోసం ఆయా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని అప్పారాజుపేట సచివాలయ అగ్రికల్చర్ అధికారి గాయత్రి అన్నారు. అర్హులైన వారు తమ కార్యాలయంలో సంప్రదించి కావాల్సిన ధృవీకరణ పత్రాలు తీసుకువస్తే వెంటనే వారికి కౌలుకార్డులు మంజూరు చేస్తామన్నారు. కౌలు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నేత రవికుమార్

రాజంపేట : పెండింగ్‌లో ఉన్న పురపాలిక బదిలీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పురపాలిక కార్యాలయంలో కార్మికులతో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 5న వేతనాలు చెల్లించాలన్నారు. ఇచ్చిన హామీ మేరకు సమ్మెకాలనికి సంబంధించిన వేతనాన్ని వేయడంతో పాటు మెడికల్ బిల్లులు ఇవ్వాలన్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ ఏ స్థితిలో ఉందో తెలపాలన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇంతవరకు కార్మికులకు వేతనాలు రాలేదని, స్పందించకుంటే త్వరలో నిరసనలు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో పురపాలిక వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రమణ, నాయకులు ప్రసాద్, ప్రమీల, పెంచలయ్య, రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

టన్నెల్ నిర్మాణానికి నిధులు మంజూరుపై హర్షం

రామాపురం : మండలంలోని గువ్వలచెరువు టన్నెల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం హర్షణీయమని గువ్వలచెరువు గ్రామ సర్పంచ్ భర్త మాదరాసు శివయ్య అన్నారు. మండలంలోని గువ్వలచెరువులో శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ ఎంతో కాలం నుండి ఎదురుచూస్తున్న గువ్వలచెరువు ఘాట్ టన్నెల్ నిర్మాణానికి 2024–25 సంవత్సానికిగాను రూ.1,000 కోట్లు నిధులతో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని నిధులు మంజూరు చేయడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ఏపీ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. వైఎస్సార్ జిల్లా సుగాలి బిడికి గువ్వల చెరువు ఆఖరి మలుపు వరకు జరిగే పనులు త్వరితగతిన నిర్మాణం జరిగేలా చూడాలని కోరారు.

ప్లేట్లు, గ్లాసుల పంపిణీ



మానసిక దివ్యాంగులకు ప్లేట్లు, గ్లాసులు అందజేస్తున్న దృశ్యం

రాయచోటి టౌన్ : మానవత, లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి ఆధ్వర్యంలో పట్టణంలోని భవిత (మానసిక దివ్యాంగుల) పాఠశాలలోని విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. శుక్రవారం రాయచోటి వృక్ష రక్షణ సమితి వ్యవస్థాపకుడు తులసీరెడ్డి కుమారుడు క్రాంతికుమార్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంస్థల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

8న జాబ్‌మేళా

తంబళ్లపల్లె : పుంగనూరు ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 8న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తంబళ్లపల్లె టీఎన్ వెంకటసుబ్బారెడ్డి ప్రభుత్వ ఐటీఐ, పుంగనూరులో ఐటీఐలో పని చేసినవారు, శిక్షణ పొందుతున్న వారితో పాటు ఇంటర్,డిగ్రీ పాసైనా అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లతో జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. చైన్నై, బెంగళూరుకు చెందిన ప్రముఖ కంపెనీలు హాజరై అర్హులైనవారిని క్యాంపస్ ఎంపికలు నిర్వహిస్తారన్నారు. నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



సంబేపల్లె: వైఎస్సార్‌సీపీ కార్యకర్త షామీర్‌ను పరామర్శిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

సంబేపల్లె : మండల పరిధిలోని రౌతుకుంట పంచాయతీ దిన్నెమీదపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త షామీర్ ఇటీవల టీడీపీ శ్రేణుల దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్సపొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి శుక్రవారం దిన్నెమీదపల్లెలో షామీర్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం దాడి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. కార్యకర్తలకు అండగా ఉంటామని శ్రీకాంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హసీనా, అహ్మద్, ఎంపీటీసీ భద్రయ్య, నాయకుడు వేణుగోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ బయన్న, వాసుదేవరెడ్డి, జయరామిరెడ్డి, యర్రంమరెడ్డి, మహదేవ రెడ్డి, అలీ, రంగారెడ్డి, అమరనాథరెడ్డి, వెంకటేశ్వర్లు, అల్తాఫ్, ఆదెయ్య, ఈశ్వర్ రెడ్డి, కృష్ణారెడ్డి, రాజారెడ్డి, పెద్ద అయ్యవారయ్య, చిన్న అయ్యవారయ్య, నాగూరి వలీ, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లెకు చెందిన మాజీ సింగల్ విండో అధ్యక్షుడు యర్రంరెడ్డిని, వారి కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల యర్రంరెడ్డి కుమారుడు శివారెడ్డి గుండెపోటుతో మరణించారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లె మండలం యర్రంరెడ్డి గ్రామం మూడిళ్లపల్లెకు శుక్రవారం శ్రీకాంత్‌రెడ్డి వెళ్లి యర్రంరెడ్డిని పరామర్శించి, శివారెడ్డి మృతిపట్ల ప్రగాఢ సానుభూతిని తెలియజేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

వర్ధంతి కార్యక్రమంలో..

గాలివీడు : వైఎస్సార్‌సీపీ నాయకులు పప్పిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సతీమణి ఉషారాణి వర్ధంతి కార్యక్రమంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన పాల్గొని ఆమె చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ యదుభూషన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆవుల నాగభూషన్‌రెడ్డి, సర్పంచ్‌లు చింతం రెడ్డి రామాంజుల్‌రెడ్డి, కేశవరెడ్డి, ఉమా ప్రభాకర్, పుల్లారెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లక్కిరెడ్డిపల్లె: మాజీ సింగల్ విండో అధ్యక్షుడు యర్రంరెడ్డిని పరామర్శించిన శ్రీకాంత్ రెడ్డి

శిక్షణలో నేర్చుకున్నది పాటించాలి



శిక్షణా శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా స్థాయి అధికారులు

రాయచోటి అర్బన్ : శిక్షణా కార్యక్రమంలో తెలియజేసిన సూచనలు, పద్ధతులను ప్రతి ఒక్కరూ విధుల్లో పాటించాలని డీపీఎంఓ రియాజ్‌బేగ్, డీఎస్ఎంఓ విష్ణువర్ధన్‌రెడ్డిలు తెలియజేశారు. శుక్రవారం పట్టణంలోని రామాపురం అర్బన్ పీహెచ్‌సీలో క్యాన్సర్ వ్యాధిపై నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో, ఆరోగ్య కేంద్రాల్లో ఓపీకి వచ్చిన రోగులలో క్యాన్సర్ లక్షణాలను ఎలా గుర్తించాలి, స్క్రీనింగ్ పరీక్షలకు ఎక్కడకు రెఫర్ చేయాలి, ఒకవేళ వ్యాధి నిర్ధారణ అయితే చికిత్సకు సంబంధించి రోగులు సక్రమంగా వాడే విధంగా ఫాలోఅప్ చేయాలి తదితర విషయాల గురించి వివరించారు. శిక్షణలో మీరు ఏమి నేర్చుకున్నారు, విధి నిర్వహణలో మీకు శిక్షణ ఎంత వరకు సహాయపడింది? అంటూ వైద్యులను, ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రాల ఆరోగ్య కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. జూలై 18 నుంచి ఆగస్టు 2 వరకు నిర్వహించే కుష్టువ్యాధి సర్వేను విజయవంతం చేయాలంటూ కోరారు. స్టాప్ డయేరియా, డెంగీ మాసోత్సవాలను నిర్వహించి ప్రజల్లో వ్యాధుల పట్ల అవగాహన కల్పించడం ద్వారా వాధుల వ్యాప్తిని అరికట్టాలంటూ సూచించారు. కార్యక్రమంలో శిక్షకులు మధుసూదన్‌రెడ్డి, రవికుమార్, నాజియా తోపాటు పలు పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రాల కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి ట్యాంకులను శుభ్రం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వరప్రసాద్

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలో తాగు నీటి ట్యాంకులను శుభ్రం చేయాలని ఎంపీడీఓ హరి ప్రసాద్ రెడ్డి తెలిపారు. మండలంలో 52 ఓహెచ్‌ఆర్ ఎస్‌లు, 21 జీఎల్ఎస్ఆర్ ట్యాంకులు ఉన్నాయన్నారు. ఆయా గ్రామాల పంచాయతీ సెక్రటరీలు వారివారి గ్రామాల పరిధిలో ఉన్న నీటి ట్యాంకులను శుభ్రం చేసి ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో ట్యాంకులు శుభ్రపరిచి మంచినీటిని ప్రజలకు అందించాలన్నారు. నేటి నుంచే ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఉద్యమిద్దాం

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమిద్దామని ఆర్ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్ అన్నారు. మండలంలోని చెన్నముక్కపల్లె జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ఆర్ఎస్‌యూ 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆటపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ 2014లో జూలై 5న ఆర్ఎస్‌యూ ఏర్పడి విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తూ వస్తోందన్నారు. నిత్యం ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్న కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలకు కొమ్ముకాస్తూ వారికి వేల కోట్లు దోచిపెడుతోందన్నారు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరచి ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి భారీగా నిధులను కేటాయించాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వంశీరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులతోపాటు ఆర్ఎస్‌యూ నేతలు వెంకటేష్, శివ, మహేష్,, వెంకటరమణ, నవీన్, బాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

గ్రామ పంచాయతీ అక్రమాలపై విచారణ

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీ అక్రమాలపై అధికారులు విచారణ చేపట్టారు. గ్రామ పంచాయతీలో జరిగిన అవకతవకలు, నిధుల దుర్వినియోగంపై అందిన ఫిర్యాదుల మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం విచారణ చేపట్టారు. స్థానిక గ్రామ పంచాయతీలో 2021–22 నుంచి ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులు, నిధుల వినియోగం, పంచాయతీకి వచ్చిన ఆదాయం రికార్డులు పరిశీలించారు. పంచాయతీ పరిధిలో కార్మికుల సంఖ్య, నెలవారీ వేతనాలు, వాహనాలు, డీజిల్ ఖర్చులుకు సంబంధించి రికార్డులు, ఎంబుక్‌లు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అన్ని రికార్డులు పరిశీలించిన అనంతరం ఉన్నతాధికారులకు నివేదిస్తామని డీఎల్‌పీవో నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ పరుశురాం, నాగేశ్వర్, హరి, నవీన్, ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు బ్యాంకు ఖాతాల్లో వేయాలి

గాలివీడు : గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు పారిశుద్ధ్య కిట్‌లను అందజేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు నాణ్యమైన పనిముట్లు ఇవ్వాలన్నారు. కేవలం 11 మందితో పని చేస్తుండటంతో వారి మీద తీవ్ర పనిభారం ఉందన్నారు. గాలివీడు జనాభా అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. బ్యాంక్ ఖాతాల ద్వారా వేతనాలు ఇవ్వకపోవడం సరైనది కాదన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు ఓబులమ్మ, లక్ష్మీదేవిలతో పాటు పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు రామచంద్ర, నరసింహులు, నారాయణమ్మ, రాజమ్మలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నేత రామాంజులు

ఇన్‌స్టంట్ పరీక్షలకు అవకాశం కల్పించాలి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యార్థులందరికీ ఇన్‌స్టంట్ పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు యాదవ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ కోరారు. శుక్రవారం వైవీయూ పరిపాలన భవనం ఎదుట విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2021–24 విద్యా సంవత్సరంలో డిగ్రీ చదివిన విద్యార్థులకు సంబంధించి 4వ సెమిస్టర్‌కు మాత్రమే ఇన్‌స్టంట్ అవకాశం ఇచ్చారని, అన్ని పరీక్షలు రాసుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు. అనంతరం వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి డా. ఎన్. ఈశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

పేదలకు 104 వాహన సేవలు వరం

కేవీపల్లె : పేదలకు 104 వాహన సేవలు వరమని జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. శుక్రవారం మండలంలోని వగళ్లలో 104 వాహన సేవలు తనిఖీ చేశారు. వైద్య పరికరాలను, మందుల నిల్వలను, వాహనం నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 సేవలు ప్రతి నెలా నియమిత తేదిన వారి గ్రామానికే వచ్చి వైద్య సేవల తోపాటు మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. వీలైనంత ఎక్కువ మంది సేవలు పొందేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. అతిసార, మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వ్యాప్తి పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రేష్మ, పర్యవేక్షకులు పురుషోత్తం, రుక్మిణి, సిబ్బంది చంద్రమైత్రిసుధ, ఆలేఖ్య, 104 సిబ్బంది వెంకటరమణ, ధరణి రెడ్డి, మోహన్, ఆశలు ధనలక్ష్మీ, శంకరమ్మ తదితరు పాల్గొన్నారు.

బాలలకు ధార్మిక శిక్షణా తరగతులు

కడప కల్చరల్ : సనాతన ధర్మ పరిరక్షణ సేవలో భాగంగా ఈనెల 7 నుంచి నగరానికి చెందిన బాలబాలికలకు ధార్మిక శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు కడప నగరం జయనగర్ కాలనీకి చెందిన శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం చైర్మన్ వి.సీతారామయ్య తెలిపారు. ప్రతి ఆదివారం 5–15 సంవత్సరాల మధ్య వయస్సుగల బాలబాలికలకు ఉచితంగా ఉదయం 9.30 నుంచి 11.00 గంటల వరకు ఈ తరగతులు నిర్వహిస్తామన్నారు. బాలలకు శ్లోకాలు, పద్యాలు, వ్యక్తిత్వ వికాస కథలు, భగవద్గీత శ్లోకాలు, పురాణ ఇతిహాసాలు, ఆటల ద్వారా ఏకాగ్రత తదితర అంశాలు నేర్పేందుకు ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల్యం నుంచే వారిలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆధ్యాత్మికత, సత్యం, భారతీయ సంస్కృతి, మానవతా విలువలను అభివృద్ధి చేసేందుకు ఈ తరగతులు ఉపయోగపడగలవన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పిల్లకు శిక్షణా తరగతులు పంపాలని కోరారు. పూర్తి వివరాలకు 99662 65101, 8328 209158 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలి

మదనపల్లె సిటీ : ఆడపిల్లలను పెంచడమే కాదు.. ఉన్నత చదువులు చదివించాలని మదనపల్లె డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో క్రై, ఫోర్డు సంస్థల ఆధ్వర్యంలో పూరిపదాయ్ దేశ్‌కి భళాయ్ ప్రచార కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమ్మాయిల పట్ల కుటుంబంలో, సమాజంలో వుండే అపోహలు తొలగిపోవాలంటే తల్లిదండ్రులకు అవగాహన ఎంతైనా అవసరం ఉందన్నారు. సెకండరీ విద్యలోనే అమ్మాయిలను చదువు మాన్పిస్తున్నారన్నారు. ఇలాంటి సంఘటనలు నిత్యం జరుగుతున్నాయన్నారు. ఫోర్డు డైరెక్టర్ జల్లా లలితమ్మ మాట్లాడుతూ చదువుకు దూరమైన పిల్లలు తిరిగి బడిలో చేర్పించడం, ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ అమ్మాయిల చదువును ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలో బీఈడీ, ఎంఈడీ 2, 4 సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 15 కేంద్రాలలో మొదలయ్యాయి. పరీక్షలను వైవీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి కడపలోని నాగార్జున కళాశాల కేంద్రాన్ని తనిఖీ చేశారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎన్. ఈశ్వర్ రెడ్డి కడపలోని నాలుగు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. కట్టుదిట్టంగా నిర్వహించాలని పరీక్షల అధికారులకు వారు సూచించారు. ప్రతి కేంద్రంలో విశ్వవిద్యాలయం నుంచి అబ్జర్వర్లను నియమించగా విశ్వవిద్యాలయ హైపవర్ కమిటీ కమలాపురం, ప్రొద్దుటూరు, బద్వేలు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. అలానే వైవీయూలో జరుగుతున్న పీజీ సెమిస్టర్ పరీక్షలను ఆచార్య రఘునాథరెడ్డి తనిఖీ చేశారు.

ప్రతి ఒక్కరిలో క్రీడా స్ఫూర్తి ఉండాలి



టోర్నీని ప్రారంభిస్తున్న ఎస్ఐ అబ్దుల్ జహీర్, నందా యాదవ్‌లు

నందలూరు : ప్రతి ఒక్కరిలో క్రీడా స్ఫూర్తిని కలిగి జయాపజయాలను సమానంగా స్వీకరించాలని ఎస్ఐ మహ్మద్ అబ్దుల్ జహీర్ పేర్కొన్నారు. నాగిరెడ్డిపల్లె పంచాయతీ అరవపల్లిలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో దివంగత తుంటి యానాదయ్య, సరోజమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు తుంటి నందా యాదవ్ ఆధ్వర్యంలో నందలూరు ప్రీమియర్ లీగ్ 9వ సీజన్ నందలూరు, ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాల స్థాయి హార్డ్ టెన్నీస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఎస్ఐ మహ్మద్ అబ్దుల్ జహీర్, నందా యాదవ్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు పల్లె గ్రీష్మంత్ రెడ్డి, ముమ్మడి శెట్టి సుధాకర్, శివకోటి, మున్నా, రంజిత్, పుత్తా శంకర, కుర్రామణి యాదవ్, మేస్త్రీ నరేంద్ర, టైలర్ బాబు, నాగరాజు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



పుల్లంపేట: ప్రత్యేక అలంకారంలో మేడాలమ్మ



సిద్దవటం: పూజలందుకున్న శీతల గంగమ్మ

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని కొత్తకోడూరు, బలిజవీధి గంగమ్మ దేవతకు శుక్రవారం ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. అలాగే నిర్వాహకులు అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

శీతల ఆలయంలో..

సిద్దవటం : మండలంలోని పార్వతీపురం గ్రామంలో వెలసిన శీతల గంగమ్మకు శుక్రవారం భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి అభిషేకం, అలంకరణ, గణపతిపూజ, పుణ్యహావాచనం, అమ్మవారికి కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలను చేశారు. అనంతర వచ్చిన భక్తులు అమ్మవారి గుడిచుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకొని, కాయాకర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

మేడాలమ్మకు ప్రత్యేక పూజలు

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లి గ్రామంలో వెలసివున్న మేడాలమ్మకు పూజారి శివశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం సందర్భంగా వేకువజాము నుంచే అమ్మవారికి అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. మహిళలు పూజల్లో పాల్గొని ప్రదక్షిణలు చేశారు. పూజల్లో పాల్గొన్నవారికి ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.



రైల్వేకోడూరు అర్బన్: ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న కొత్తకోడూరు గంగమ్మ

'దోచుకోవడానికే పైపుల బ్రిడ్జి నిర్మాణం'



బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ప్రజలు

- స్లాబ్ బ్రిడ్జినే నిర్మించాలని స్థానికుల డిమాండ్
- లేకుంటే నిర్మాణ పనులు అడ్డుకుంటామంటూ హెచ్చరిక

వీరబల్లె : మాండవ్య నదిపై మండల పరిధిలోని పుల్లగూర గండి వద్ద బ్రిడ్జి నిర్మాణాన్ని గతంలో ప్రతిపాదించిన విధంగా స్లాబ్ విధానంలోనే బ్రిడ్జి నిర్మాణం జరగాలని వంగిమళ్ల గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వీరబల్లె నుంచి వంగిమళ్ల మార్గంలో పుల్లగూరు గండి వద్ద మాండవ్య నదిపై బ్రిడ్జి నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.7.85 కోట్లను మంజూరు చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో బ్రిడ్జి నిర్మాణాన్ని పైపుల బ్రిడ్జి విధానంలో చేపట్టాలని నిర్ణయించింది. దీంతో విషయం తెలుసుకున్న వంగిమళ్ల, దిగువ రాచపల్లె గ్రామ పంచాయతీల ప్రజలు శుక్రవారం నిర్మాణ పనులను అడ్డుకున్నారు. గతంలో నిర్ణయించిన విధంగా స్లాబ్ బ్రిడ్జినే నిర్మించాలని లేదంటే పనులు ఆపాలని అక్కడ పనులు చేస్తున్నవారికి తెలియజేశారు. పైపుల బ్రిడ్జి వేయాలనుకుంటే మాత్రం ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వంలోని పెద్దలతో కాంట్రాక్టర్లు కుమ్మక్కై అదే నిధులతో పైపుల బ్రిడ్జిని నిర్మిస్తామనడం దోచుకునే విధంగా ఉందని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పైపుల బ్రిడ్జి నిర్మించేందుకు ఒప్పుకోమన్నారు. నిర్మాణ పనులు చేపట్టే కాంట్రాక్టర్ పునాదుల కోసం నిబంధనలు పాటించకుండా పైపైనే ఇసుక లోడి పైపుల ద్వారా బ్రిడ్జి పనులు చేపట్టాలని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. వరదలు వస్తే పైపులతో నిర్మించే బ్రిడ్జి కొట్టుకుపోతుందని, కావున స్లాబ్ బ్రిడ్జిని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

బోధనకు ఆటంకం కలిగించే యాప్‌లను రద్దు చేయాలి

గుర్రంకొండ : బోధనకు ఆటంకం కలిగించే యాప్‌లను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి, కార్యదర్శులు జాబీర్, భాస్కర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం అమలు పేరుతో ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తున్న జీవో నెం. 117 ను వెంటనే రద్దు చేయాలన్నారు. ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు ప్రాథమిక విద్యలో, ఆరు నుంచి పదవ తరగతి వరకు, ఆరు నుంచి 12 వతరగతి వరకు సెకండరీ స్థాయి విద్య పరిధిలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మాధ్యమానికి సమాంతరంగా తెలుగు లేదా ఉర్దూ మాధ్యమాన్ని కొనసాగించాలన్నారు. విద్యార్థుల తల్లితండ్రుల అభీష్టం మేరకు వారికి నచ్చిన మాధ్యమాల్లో చదుకొనే అవకాశం కల్పించాలన్నారు. అనవసర యాప్‌లను రద్దు చేసి బోధనేతత కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ నియామకాల్లో అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేసి ప్రాథమిక విద్యలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా ప్రభుత్వం చొరవ తిసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల చెల్లించాల్సిన అన్ని రకాల బకాయిలు చెల్లించాలన్నారు. సమావేశంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు అజ్మతుల్లా, యూటీఎఫ్ నాయకులు యూసూఫ్, వెంకటయ్య,రెడ్డెన్న, రాజేంద్రప్రసాద్, శంకరయ్య, హసన రజనీ, షమాభాను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్ఞానాభిరామస్వామికి కలశాభిషేకం

గుర్రంకొండ: మండలంలోని రామాపురం గ్రామంలో వెలసిన శ్రీ జ్ఞానాభిరామస్వామి వారి సహస్ర కలశాభిషేక ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. లోక కల్యాణ కోసం స్వామివారి ఉత్సవాలు మూడురోజులు పాటు నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం గణపతిపూజ, వాసుదేవ శుద్ధి, పుణ్యావచనం కావించారు. వాస్తుహోమం, అంకురార్పణహోమం, ద్వారతోరణపర్వు, కలశాధివాసం కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి, నవగ్రహ,మూర్తిహోమం, మహాసుదర్శన, శ్రీరామతారక హోమం అష్టలక్ష్మీ హోమాలు చేశారు. ఈసందర్భంగా 1001 కలశాలను ప్రతిష్ఠించి విశిష్ట పూజలు నిర్వహించారు. రోజంతా యజ్ఞయాగాలు నిర్వహించి స్వామివార్లకు అభిషేకాలు, పూజలు చేశారు. సకాంలో వర్షాలు కురిసి పాడిపంటలతో అందరూ వర్ధిల్లాలని కోరుతూ ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వేణుగోపాలబట్టర్, కృష్ణ, గోపాలాబట్టర్, దొరస్వామి, మధుసూధన్, శ్రీనివాసబట్టర్‌లు పాల్గొన్నారు.

7న అవగాహన సదస్సు

కడప ఎడ్యుకేషన్: నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని తేజ పెట్రోల్ బంక్ పక్కన గల శంకర్ రెడ్డిస్ సాయి బాలాజీ కోచింగ్ సెంటర్‌లో 7వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు డీఎస్సీ(ఎస్‌జీటి, ఎస్), గ్రూపు–2 పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎ. శంకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 99667 87371, 88861 42609 నెంబర్లను సంప్రదించాలన్నారు.